క్లుప్తంగా

వైద్యుల మెగా సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామరాజు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), కిమ్స్ బొల్లినేని సంయుక్తాధ్వర్యంలో స్థానిక ఐఎంఏ హాలులో ఆదివారం మెగా సెమినార్ నిర్వహించారు. దీనికి ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 350 మందికి పైగా వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ వైద్యాంశాలపై చర్చించారు. ప్రముఖ కార్డియాలజిస్టులు డాక్టర్ ఎంఎస్ రామరాజు, డాక్టర్ సతీష్, కిమ్స్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వెంటూరి సుధాకర్ ఆధునిక వైద్యంపై అవగాహన కల్పించారు.

ప్రశాంతంగా నర్సింగ్ ప్రవేశ పరీక్షలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం స్టడీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన బీఎడ్, నర్సింగ్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇగ్నో ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ ఈ.కృష్ణారావు తెలిపారు. ఈ పరీక్షలకు బీఈడీ అభ్యర్థులు 14 మంది, నర్సింగ్ అభ్యర్థులు 15 మంది పరీక్షలు రాశారన్నారు. వీటిని కేంద్ర సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్ ఆధ్వర్యంలో స్టడీ సెంటర్ సిబ్బంది శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పరీక్షలను పర్యవేక్షించినట్టు చెప్పారు.

పారిశ్రామిక వేత్త సత్తి ప్రసాదరెడ్డికి మాతృ వియోగం



సత్తి మంగయ్యమ్మ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి వీఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి మాతృమూర్తి సత్తి మంగయ్యమ్మ(79) ఆదివారం తెల్లవారుజామున పరమపదించారు. స్థానిక ప్రకాశంనగర్‌లో నివసిస్తున్న మంగయ్యమ్మకు ప్రసాదరెడ్డితో పాటు, సత్తి బ్రహ్మారెడ్డి, కుమార్తె కర్రి విజయలక్ష్మి ఉన్నారు. ప్రసాదరెడ్డి తండ్రి సత్తి వెంకటగోపాలరెడ్డి టీచర్‌గా విధులు నిర్వహించారు. కొంతకాలం క్రితమే ఆయన కన్నుమూశారు. మంగయ్యమ్మ పార్థివదేహానికి స్థానిక కోటిలింగాల ఘాట్ రోటరీ కైలాస భూమిలో అంత్యక్రియలు జరిగాయి. నగరానికి చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, రెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: కొత్త లైన్ల నిర్మాణ పనుల కోసం సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని హరిపురం, ఇన్‌కం టాక్స్ ఆఫీస్ ఏరియా, కోరుకొండ రోడ్డు, ఆదెమ్మ దిబ్బ, హరిపురం, వీరభద్రపురం, లలితానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.


నర్సరీని సందర్శించిన జోగినాయుడు



జోగినాయుడు దంపతులను సత్కరిస్తున్న పుల్లా పెదసత్యనారాయణ

కడియం: ప్రముఖ సినీ నటుడు జోగినాయుడు ఆదివారం మండలంలోని కడియపులంకలో ఉన్న శ్రీసత్యదేవ నర్సరీని కుటుంబ సమేతంగా సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా పెద సత్యనారాయణ వారికి వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. క్యాక్టై ప్లాంట్, ఎర్ర చిత్రమాల, కనంగాకీర్కి, దేవదార్ తదితర మొక్కలపై జోగినాయుడు ఆసక్తిగా తెలుసుకున్నారు. వీరి వెంట డా.పెద్దింటి రామబ్రహ్మం, జయశ్రీ, విజయగోపాల్, మెర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

పల్లాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కడియపులంకలోని పల్లాలమ్మవారు

కడియం: మండలంలోని కడియపులంకలో ఉన్న పల్లాలమ్మవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్నంగి ప్రభాకరశర్మ పర్యవేక్షణలో చండీ హోమం, ఇతర పూజాది కార్యక్రమాలు జరిపించారు. అనంతరం మహిళలు పల్లాలమ్మవారి లలితా పారాయణం చేశారు. ఈ నెల 25వ తేదీన 108 కలశాలతో గ్రామోత్సవం, అమ్మవారికి స్నపనం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

స్త్రీ మూర్తికి అండగా..

- మహిళల కోసం అందుబాటులోకి పింక్ టాయ్‌లెట్లు
- మరిన్ని చోట్ల ఏర్పాటుకు ప్రణాళిక
- రూ.10 లక్షలతో నిర్మాణం
- ఇందులో అతివలకు ఎన్నో సౌకర్యాలు



నూతనంగా నిర్మించిన పింక్ టాయ్‌లెట్

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల్లో భాగంగా నగరంలో మహిళలకు సౌకర్యవంతంగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లతో పింక్ టాయ్‌లెట్ల ఏర్పాటుకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా కోర్టు ఆవరణను ఆనుకుని రూ.పది లక్షల వ్యయంతో ప్రయోగాత్మకంగా పింక్ టాయ్‌లెట్‌ను నిర్మించారు. ఇందులో ఐదు టాయ్‌లెట్ గదులు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో హైజెనిక్‌గా ఉండేలా ఏర్పాటు చేయడంతో పాటు, టాయ్‌లెట్ల నిర్వహణకు ప్రత్యేక కేర్ టేకర్‌ను నియమించారు. చంటి పిల్లలతో వచ్చే మహిళలకు బిడ్డలకు పాలు పట్టించేందుకు వీలుగా ప్రత్యేక గదిని కేటాయించారు. ఫ్యాన్‌తో పాటు, చిన్న పిల్లలను పడుకోబెట్టేందుకు ఉయ్యాలలను కూడా ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రతి నగరంలో ఇలాంటి టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో ఈ పింక్ టాయ్‌లెట్ల నిర్మాణం చేపట్టినట్టు నగరపాలక సంస్థ అధికారులు వెల్లడించారు. మహిళా దినోత్సవం రోజున కలెక్టర్ ప్రశాంతి దీనిని ప్రారంభించి, నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.



నాప్కిన్ వెండింగ్ మెషీన్



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ప్రదేశం

నాప్కిన్ మెషీన్

పింక్ టాయ్‌లెట్లలో మహిళలు, యువతులకు అవసరమైన నాప్కిన్లను అందించేందుకు ఆధునిక నాప్కిన్ విక్రయించే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. అతి తక్కువ ధరతో కేవలం రూ.5కే శానిటరీ నాప్కిన్‌ను ఈ మెషీన్ అందిస్తుంది. మెషీన్‌లో ఐదు రూపాయల కాయిన్ వేస్తే శానిటరీ నాప్కిన్ బయటకు వస్తుంది.

విశ్రాంతి తీసుకునేలా..

ఈ సెంటర్‌లో మహిళలు విశ్రాంతి తీసుకోవడానికి తగిన ఏర్పాట్లు చేశారు. స్నానం చేసేందుకు కూడా సౌకర్యాలున్నాయి. చిన్న పిల్లలకు డైపర్స్ మార్చుకోవడానికి వసతి కల్పించారు. గోదావరి పుష్కరాల రేవుకు సమీపంలో దీనిని ఏర్పాటు చేయడంతో, వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే మహిళలకు ఇదెంతో సౌకర్యంగా ఉంటుందంటున్నారు.

సౌకర్యంగా ఉంది



మహిళలకు అన్ని విధాలా సౌకర్యంగా ఉండే విధంగా పింక్ టాయ్‌లెట్ల నిర్మాణం బాగుంది. చిన్నారులకు పాలు పట్టే సమయంలో, బహిరంగ ప్రదేశాల్లో ఇబ్బందులు పడకుండా, ఈ విధమైన సౌకర్యాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం అభినందనీయం. నగరంలో మరిన్ని చోట్ల ఇలాంటివి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– బైరెడ్డి లతారెడ్డి, రాజమహేంద్రవరం

మరిన్ని ఏర్పాటు చేస్తాం



ఇది పూర్తిగా మహిళల కోసం మాత్రమే ఏర్పాటు చేశారు. వీలైనంత ఎక్కువ మంది మహిళలు వీటిని ఉపయోగించుకోవాలి. నగరంలో మరిన్ని ప్రాంతాల్లో పింక్ టాయ్‌లెట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ వినూత్న, ఆరోగ్య విభాగం అధికారి, నగరపాలక సంస్థ

దళిత చైతన్యానికి ధర్మన్న జీవితం అంకితం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశాలాక్షి

సీటీఆర్ఐ: కవిగా, వక్తగా, వ్యాసకర్తగా, జయభేరి సంపాదకునిగా తన జీవిత ప్రస్థానాన్ని దళిత చైతన్య కోసమే కొనసాగించిన మహోన్నతుడు కుసుమ ధర్మన్న అని ఎస్‌కేఆర్ డీఎడ్ కళాశాల తెలుగు శాఖాధిపతి పి.విశాలాక్షి కొనియాడారు. కళా గౌతమి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కుసుమ ధర్మన్న జయంత్యుత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, భవిష్యత్తు పరిణామాలు ఊహించి, తన భావాలకు అక్షర రూపమిచ్చి, దళిత జాతిలో చైతన్యం కోసం స్వాతంత్ర్యానికి ముందే పాటలు రాశారంటే, నిజంగా ఆయనలో అద్భుత శక్తి ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాగౌతమి అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ, కందుకూరి శిష్యుడిగానే కాక, సంస్కరణ, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, సామ్యవాద భావనల అపురూప సమ్మేళనమే కుసుమ ధర్మన్న అని ప్రశంసించారు. కొవ్వూరు సంస్కృత కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎం వాణికుమారి మాట్లాడుతూ, దళిత ఉద్యమాన్ని వాడవాడలా, పల్లెపల్లెలా తన ప్రసంగాల ద్వారా వ్యాప్తి చేసిన ధీరోదాత్తుడు ధర్మన్న అని కొనియాడారు. అధ్యాపకురాలు కడియం శారద మాట్లాడుతూ, తన మహోగ్ర కంఠ స్వరంతో నింగి నేల దద్దరిల్లేలా మాకొద్దు ఈ నల్లదొరతనం అంటూ పాడిన తొలి ప్రజా వాగ్గేయకారుడు ధర్మన్న అని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు ఎ.సరళ, ఎం.సోనీ, ఎం.శివప్రసాద్, డాక్టర్ గౌతమ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపదేశమిచ్చేది మహా భారతం



వీణ కచేరి చేస్తున్న ఈశ్వరకుమార్‌దేవ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహా భారతం ఉపదేశంతో కూడిందని పశ్చిమ గోదావరి జిల్లా కైకరానికి చెందిన జటావల్లభుల రామమూర్తి అన్నారు. అజ్ఞాతవాసంలో దొరకకుండా ఉండాలనే పాండవులకు, దొరుకుతారని ఎదురుచూసే కౌరవులకు విరాట్ పర్వం ఓ పరీక్ష లాంటిదన్నారు. నన్నయ మహాభారతాన్ని తెలుగులో రాయడానికి శ్రీకారం చుట్టి, రెండున్నర పర్వాలు పూర్తి చేస్తే, విరాట్ పర్వం నుంచి తిక్కన సోమయాజి మహాభారత రచన కొనసాగించి, 15 పర్వాలు పూర్తిచేశాడని చెప్పారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీశివరామకృష్ణ మారుతీ స్వరూప సమర్థ సద్గురు సాయినాథ శ్రీషిర్డీసాయి మందిర 13వ వార్షిక మహోత్సవాలు రెండో రోజైన ఆదివారం కొనసాగాయి. సాయంత్రం జటావల్లభుల రామమూర్తి.. మహాభారతంలోని విరాటపర్వంపై ప్రవచించారు. కీచక వధ ఘట్టాన్ని ప్రస్తావిస్తూ, పరస్త్రీ వ్యామోహం ఉంటే ఎలాంటి చావు వస్తుందో భీమసేనుడు చూపించాడని వివరించారు. వక్తను అద్దంకి వేంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు, రావిపాటి మదన గోపాలస్వామి తదితరులు అభినందించారు.

అనంతరం ఎం.ఈశ్వరకుమార దేవ్ వీణ కచేరితో అలరించారు. మృదంగంతో అనపిండి కామేశ్వరరావు, ఘటంపై రాయప్రోలు బాలదినకర్ సహకరించారు. కాగా మైలవరపు నారాయణ(ద్రాక్షారామ) బ్రహ్మత్వంలో, దెందులూరి శ్యామ్‌కుమార్ అర్చకత్వంలో 13 రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు.

ఐఎల్‌టీడీ సెంటర్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు



ఐఎల్‌టీడీ సెంటర్ రైతు బజార్ వద్ద ఏర్పడిన ట్రాఫిక్ జామ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమండ్రి ఐఎల్‌టీడీ జంక్షన్ నుంచి బాలాజీపేట సెంటర్‌కు వెళ్లే రోడ్డులో రైతుబజార్ వద్ద ఆదివారం వస్తే చాలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీనివలన వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుబజార్‌కు వచ్చే వినియోగదారులతో పాటు, నగరంలోకి రాకపోకలకు తోడు, ఇసుక లారీలు యథేచ్ఛగా తిరగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ఆదివారం ఒక్క రోజైన పోలీసు అధికారులు ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్వర్ణాంధ్ర రాంబాబుకు నిత్యాన్న దాత అవార్డు



డాక్టర్ గుబ్బల రాంబాబును సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: గత 27 ఏళ్లుగా నిరాశ్రయుల కోసం భోజనం, నివాస, వసతి సౌకర్యాలు కల్పిస్తూ, సామాజిక సేవలో ఆదర్శంగా నిలిచిన స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబుకు అంతర్జాతీయ లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం వారు నిత్యాన్నదాత అవార్డును జిల్లా పూర్వ గవర్నర్ లయన్స్ జీవీ రావు అందజేశారు. ఆదివారం స్థానిక వైశ్యా హాస్టల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ గుప్త, కార్యదర్శి వెన్నా కుమార్‌స్వామి, కోశాధికారి వి.రాఘవరావు, జిల్లా నాయకులు కొల్లూరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రాంబాబుకు అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా జీవీ రావు మాట్లాడుతూ, నిరాశ్రయులు, అవసరార్థుల కోసం నిత్యాన్నదానం అందిస్తున్న స్వర్ణాంధ్ర రాంబాబుకు అవార్డును అందజేయడం సముచితంగా ఉందన్నారు. తనకు వచ్చిన ఈ అవార్డు స్వర్ణాంధ్ర సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన వారందరికీ అంకితం చేస్తున్నానని రాంబాబు తెలిపారు.

అంతన్నారు.. ఇంతన్నారే..!

- రోడ్లను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- కాతేరు–సీతానగరం రోడ్డులో కల్వర్టుల వద్ద కానరాని రహదారి
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.70 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితమే..



గోతులతో రఘుదేవపురం–సీతానగరం రోడ్డు

సీతానగరం: ఎన్నికల ముందు అంతా.. ఇంతా అన్నారు. ఎన్నికల తరువాత చివరకు ఏమీ లేకుండా చేశారు. కాతేరు–సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితే ఇందుకు నిదర్శనం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్డుపైనే వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. ఈ రోడ్డుకు మూడు గ్రామాల వద్ద కల్వర్టుకు ఇరువైపులా రహదారి నిర్మించాల్సి ఉండగా, ఇంత వరకూ కూటమి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా కాతేరు–సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు మంజూరు చేయించి, స్టేట్ హైవేలో చేర్చారు. రోడ్డుకు రూ.70 కోట్ల నిధులు రాబట్టి, నాలుగు లైన్ల విస్తరణ పనులు చేపట్టారు. కాతేరు నుంచి రఘుదేవపురం శివారు వరకు నాలుగు లైన్ల రోడ్డు పనులూ పూర్తయ్యాయి.

రఘుదేవపురం–సీతానగరం రోడ్డు నిల్

వైఎస్సార్ సీపీ హయాంలో కాతేరు నుంచి రఘుదేవపురం శివారుకు నాలుగు లైన్ల రోడ్డు పూర్తయింది. రఘుదేవపురం నుంచి సీతానగరం పెట్రోల్ బంక్ వరకు సుమారు 1.5 కి.మీ. ఎన్నికల కోడ్‌తో నాలుగు లైన్ల విస్తరణ పనులు స్తంభించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రోడ్డు నిర్మాణం కొనసాగుతుందని ఎదురు చూసిన మండల ప్రజలకు నిరాశే ఎదురైంది. రోడ్డుపై పాలకులు కనీస దృష్టి సారించిన దాఖలాలు లేవు. పోలవరం ప్రాజెక్టులో వదిలేసిన క్వారీ బూడిదను వేసి మమ అనిపించారు.

కల్వర్టు వద్ద వేయని రోడ్డు

ఈ రహదారిలో కల్వర్టుల వద్ద రోడ్డు వేయడానికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల వద్ద కల్వర్టులకు ఇరువైపులా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు వేయాల్సి ఉంది. ఒకొక్క కల్వర్టు వద్ద 30 నుంచి 40 మీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇంత వరకూ కూటమి పాలకులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులూ దీనిపై కనీస దృష్టి సారించలేదంటున్నారు.

ఆర్అండ్‌బీ అధికారులు రూ.34 కోట్ల నిధులు ఇందుకు అవసరం అవుతాయని ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఈ చిన్న పనులు పూర్తి చేయలేని కూటమి ప్రభుత్వం.. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తారంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అభివృద్ధి ఏమీ లేదు



కాతేరు–సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు పనులు రఘుదేవపురం వరకు పూర్తయినా, మూడు గ్రామాల వద్ద కల్వర్టుల వద్ద ఇరువైపులా కొద్దిపాటి రోడ్డు నిర్మిస్తే సరిపోతుంది. కానీ ఇంతవరకూ కొద్దిపాటి పనులు చేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఈ కొద్దిపాటి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారా అని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు ఏవేవో చెప్పారు. గెలిచాక ఏమీ లేదనిపించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ కొద్దిపాటి రోడ్డు పనులు సత్వరమే పూర్తి చేయాలి.

– పెదపాటి ప్రసాద్, సీతానగరం

రఘుదేవపురం నుంచి రోడ్డు వేయాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాతేరు నుంచి రఘుదేవపురం శివారు వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయి. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రోడ్డును ఎన్నికల కోడ్‌తో పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వంలో దీనిని పూర్తి చేస్తుందని ప్రజలు ఆశగా ఎదురు చూశారు. అయితే అసలు పట్టించుకున్న దాఖలాలే లేవు. ఎన్నికల సమయంలో ఏవేవో చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక ఏమీ చేయలేని పరిస్థితిలో కూటమి నేతలు ఉన్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– వలవల వెంకట్రాజు, రాష్ట్ర కార్యదర్శి, రైతు విభాగం, వైఎస్సార్ సీపీ, సీతానగరం

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

కంబాలచెరువు: వివిధ కారణాలతో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదులందాయి. స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలిక అదృశ్యమైనట్టు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఆల్కాట్‌గార్డెన్స్‌కు చెందిన యువతి స్థానిక మెయిన్ రోడ్డులోని ఓ బంగారు నగల దుకాణంలో పని చేస్తుంది. ఎప్పటిలాగే ఆమె దుకాణానికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదంటూ ఆమె తల్లి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

బాలాజీపేటలో..

స్థానిక బాలాజీపేటకు చెందిన యువతి అదృశ్యమైన సంఘటన రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆ యువతి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న ఓ ఆటో మొబైల్స్ దుకాణంలో పనిచేస్తుంది. ఆమె తల్లి బాలాజీపేటలో ఈ నెల 10న ఉదయం 8.30కు ఆటో ఎక్కించింది. ఆమె తల్లి ఉదయం 10.30కు దుకాణ నిర్వాహకులకు ఫోన్ చేయగా, ఆమె డ్యూటీకి రాలేదని చెప్పారు. ఈ మేరకు యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాటిలైట్ సిటీలో..

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని శాటిలైట్‌సిటీ సి–బ్లాక్‌కు చెందిన పి.మాధవి ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు, శాటిలైట్‌సిటీ గ్రామానికి చెందిన 18 ఏళ్ల యువతిని ఆమె తల్లి మందలించింది. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆ యువతి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగిరాలేదని ఆమె తల్లి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన స్మితా మాధవ్ గాత్ర కచేరి



గాత్ర కచేరిలో ఆలపిస్తున్న స్మితామాధవ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హైదరాబాద్‌కు చెందిన గాయని స్మితా మాధవ్ గాత్రం శ్రోతలను అలరించింది. శ్రీత్యాగరాజ నారాయణ దాస సేవా సమితి 74 వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో స్మితా మాధవ్ గాత్రానికి పెరవలి నందకుమార వయొలిన్, పి.జయభాస్కర్ మృదంగం, కె.హరిబాబు ఘటంపై సహకారం అందించారు. సమితి గౌరవాధ్యక్షుడు వాడ్రేవు వెంకటరమణ, చైర్మన్ చింతలూరి సుందర వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జె.సరస్వతి, ఫంక్షనల్ కార్యదర్శి వక్కలంక రామచంద్రం తదితరులు కళాకారులను గౌరవించారు. పెద్ద సంఖ్యలో సంగీతాభిమానులు హాజరయ్యారు. వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం నగరానికి చెందిన శిష్టు మధుసూదన్‌రావు గాత్ర కచేరి జరుగుతుంది.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సభ్యులు

సీటీఆర్ఐ: వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ వల్లేపల్లి రామకృష్ణ అన్నారు. ఆదివారం జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర నగర్‌లో ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యులే కాకుండా, స్థానికులు కూడా అవగాహన సదస్సుకు హాజరై, డాక్టర్ సలహాలను తీసుకున్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, ఉచితంగా మందులు కూడా అందిస్తున్నామని తెలిపారు.

టెన్త్ క్లాస్ అత్యంత కీలకం



విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేస్తున్న రమేష్

కంబాలచెరువు: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైందని లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కందికొండ రమేష్ అన్నారు. స్థానిక లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఆదివారం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు పరీక్షలను శ్రద్ధగా రాసి, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ వైస్ చైర్మన్ టి.చందన, హెచ్ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోసికుమార్‌కు డొక్కా సీతమ్మ అవార్డు



అవార్డు అందుకుంటున్న పోసికుమార్

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్‌కు ఆదివారం గుంటూరు జిల్లా పొన్నూరులో బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ శ్రీమతి డొక్కా సీతమ్మ అవార్డును ప్రదానం చేసింది. సంఘ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, కల్పన, దుర్గా వెంకటకిషోర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్టు పోసికుమార్ తెలిపారు. ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం రాజీవ్‌కాలనీలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ దీనిని ప్రారంభించారు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సినీహీరో రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.